క్లుప్తంగా

ఏఈఓను నియమించాలి



బోసిపోయిన కడవేర్గు రైతు వేదిక

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు, పోతిరెడ్డిపల్లి గ్రామాల క్లస్టర్‌కు ఏఈఓను నియమించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కడవేర్గు, పోతిరెడ్డిపల్లి గ్రామాల క్లస్టర్‌కు ఏఈఓ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెగ్యులర్ ఏఈఓ రావడంతో ఔట్ సోర్సింగ్‌లో పనిచేసిన ఏఈఓను విధుల నుంచి తొలగించారు. రెగ్యులర్ ఏఈఓ సెలవుపై వెళ్లడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆరు నెలలుగా ఏఈఓని నియమించాలంటూ జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. వెంటనే ఏఈఓను నియమించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.

కబ్జాపై కలెక్టర్‌కు అధికారుల నివేదిక



గుబ్బడి గుట్టను పరిశీలిస్తున్న ఆర్‌ఐ యాదగిరి, రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): 'గుబ్బడి గుట్టను మింగేశారు' దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. తహసీల్దార్ అనంతరెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌ఐ యాదగిరి అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ శివారు గుబ్బడి గుట్టను సందర్శించారు. కబ్జా చేసి పత్తి పంట సాగు చేస్తున్న వ్యక్తిని పొలం వద్దకు పిలిపించి మాట్లాడారు. అనంతరం ఆర్‌ఐ యాదగిరి మాట్లాడుతూ గుట్ట కింది రెండు ఎకరాల కుప్పైగా చదును చేసి పత్తి పంటను సాగుచేస్తున్నాడన్నారు. కబ్జా చేసి పత్తి పంట సాగు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకునేందుకు, భూమిని స్వాధీనం చేసుకునేందుకు కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీఓ రామ్మూర్తికి నివేదిక పంపించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగమ గ్రంథాల పంపిణీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి అనుసంధానంగా కొనసాగుతున్న ఆగమ పాఠశాల విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన శ్రీపత్తి చంద్రశేఖర్, మౌనిక దంపతులు మంగళవారం ఆగమ గ్రంథాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

హుస్నాబాద్: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో మంగళవారం వన మహోత్సవం, సఫాయి అప్నే బీమారి భగావో కార్యక్రమాన్ని నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం, నిల్వ నీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన ప్రతీమొక్కకు నిత్యం నీళ్లు పోసి కాపాడాలన్నారు. చెట్లతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు.

శిక్షా సప్తాహ కార్యక్రమం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ కార్యక్రమం కొనసాగింది. ఎఫ్ఎల్ఎన్ మేళాపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు కిష్టారెడ్డి, లోకేశ్వర్, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ టీవీ అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): పాఠశాల టీచర్లు తమ ఔదార్యం చాటుకున్నారు. మండల పరిధిలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాల టీచర్లు జ్యోతిలక్ష్మి, తిరుపతి బదిలీపై వెళ్తూ పాఠశాలకు రూ.30 వేల విలువ చేసే ఎల్ఈడీ టీవీ, బోధన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వప్నారెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బాలరాజు, ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ నాయకులు అసత్యాలను ప్రచారాలు చేస్తూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మహేష్, యాదగిరిలు మండిపడ్డారు. మంగళవారం మండల పరిధిలోని రంగనాయకసాగర్‌ను వారు సందర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేశారని, మేడిగడ్డ నిండుకుండాల పటిష్టంగా ఉందనేది నిరూపితమైందన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం

● కలెక్టర్ మనుచౌదరి



బెజ్జంకిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తామని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పేర్కొన్నారు. మండలంలోని పోతారంలో పునః ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యుత్, తాగునీటి సరఫరా, చిన్ని చిన్ని మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 15 ఏళ్ల మూతబడ్డ పాఠశాల పునరుద్ధరణకు కృషి చేసిన విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మహేష్, సెక్టోరల్ అధికారులు రామస్వామి, రంగనాథ్, పద్మయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ విష్ణు, ఎంఎల్ఓ మహతిలక్ష్మి, ఏఈలు సమ్మయ్య, చాంద్‌పాషా, అధికారులు, నాయకులు రేణుక, శ్రీనివాస్, హెచ్ఎం రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. మండలంలోని శనిగరం, కాచాపూర్, సోమారంపల్లి గ్రామాల ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ప్రగతి వివరాలు తెలుసుకున్నారు. ఇంగ్లీష్‌లో విద్యార్థులు మరింత రాణించేలా గ్రామర్ బుక్స్‌ను వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పాఠశాల సందర్శన

కోహెడ(హుస్నాబాద్): మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం కోహెడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పనులు సక్రమంగా చేపట్టాలని హెచ్ఎం ఎండీ మహమూద్‌ను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యర్థుల తల్లిదండ్రులకు నమ్మకం కుదిరేలా విద్యాబోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, పద్మయ్య, పీఆర్ ఏఈ మజీద్, ఆర్ఐ సురేందర్ పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయొద్దు

సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



కొమురవెల్లిలో బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రుణమాఫీ సొమ్మును బ్యాంకు అధికారులు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా చేయించడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట రుణమాఫీ సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించి అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ అయిన రైతులు బ్యాంకు వస్తే అధికారులు బలవంతంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయిస్తున్నారన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ జరిగిన రైతులకు నూతన రుణాలను మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, బద్దిపడగా కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పత్తి రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

వర్గల్(గజ్వేల్): జిల్లాలో అడపాదడపా జల్లులు పడుతున్నాయి. అధిక వర్షాలు కురిసినపుడు పత్తిపైరులో నీరు నిలిచి, చీడపీడలు సోకి ప్రాథమిక దశలోనే నష్టాలపాలయ్యే ఆస్కారముంటుంది. ఇలాంటి తరుణంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని పంటలు కాపాడుకోవాలని, చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా శాస్త్రవేత్తలు డాక్టర్ మహాదేవప్ప, డాక్టర్ రాంప్రసాద్ సూచనలు, సలహాలను వర్గల్ మండలం తున్కిఖాల్సా రైతు వేదిక ద్వారా ఏఓ శేషశయన పర్యవేక్షణలో రైతులు తిలకించారు. పత్తిపైరులో నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోయేలా కాల్వలు తీయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ధర్మేందర్, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి

గజ్వేల్‌రూరల్: ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో కుంటుపడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొఠారి కమిషన్ ప్రకారం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లోనే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా విద్యారంగంలో మార్పు లేదన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేస్తామని ప్రకటించినప్పటికీ స్పష్టమైన తేదీని చెప్పలేకపోయారని విమర్శించారు. పరిస్థితి ఇలాగే ఉంటే విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్, సందీప్, వంశీ, దినేష్, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మధు



విద్యార్థులతో మాట్లాడుతున్న యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి చంద్లాపూరం మధు డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదన్నారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని మండిపడ్డారు. పాఠశాలల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, లేని పక్షంలో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శ్రావణ్, వినయ్, రవి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి



దౌల్తాబాద్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఈఓలు

దుబ్బాకటౌన్: రైతుబీమా పథకానికి అర్హులైన నూతన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దౌల్తాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారి గోవింద రాజులు మంగళవారం తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోని 18 నుంచి 59 ఏళ్ల వయసుగల రైతులు ఎవరైనా ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ వరకు పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ముబాసర్‌నూర్, దొమ్మాట, తిరుమలాపూర్ గ్రామాలలో రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే లోయర్ మానేరు డ్యామ్ పైప్‌లైన్ లీకేజీతో బుధవారం పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి మంగళవారం తెలిపారు. పట్టణంలోని 17, 19, 20, 21, 36, 37 వార్డుల్లో బుధవారం నీటి సరఫరా ఉండదని, గురువారం పునరుద్ధరణ చేస్తామని పేర్కొన్నారు. సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

బకాయిలు చెల్లించాలి

దుబ్బాక: ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జి లింగాల సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని దుబ్బాక ఎంఈఓ ప్రభుదాస్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలలు 25 శాతం పేదలకు ఉచిత విద్య అందించాలన్నారు.

పత్తిచేలోకి మురుగు ప్రవాహం

ఆందోళనలో రైతు



దెబ్బతిన్న పత్తి పంటను చూపుతున్న రైతు రమేష్

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కేజీబీవీ నుంచి వచ్చే మురుగుతో తన పత్తి పంట దెబ్బతిందని గ్రామ రైతు ఇరుమల్ల రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం విలేకరులకు తన గోడు చెప్పుకున్నాడు. పాఠశాల నుంచి వచ్చే మురుగుతో పంటలు దెబ్బతింటున్నాయన్నాడు. పొలంలోకి మురుగు రాకుండా ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. పంటలు దెబ్బతింటుండటంతో ఏటా ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలిపాడు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పాఠశాల ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగుతానని హెచ్చరించాడు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం బహిరంగ వేలం పాటలు ఈఓ బాలాజీ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. స్వామి వారికి సమర్పించే వస్త్రాలు, ఒడిబియ్యం, పసుపు పోగు చేసుకునే హక్కు కొమురవెల్లికి చెందిన అశోక్‌రాజు రూ.59.10 లక్షలకు దక్కించుకున్నాడు. మల్లన్న, ఎల్లమ్మ దేవాలయాల వద్ద కొబ్బరి ముక్కల సేకరణ హక్కును రూ.39.05 లక్షలకు పాటపాడి అయినాపూర్‌కు చెందిన మల్లం శ్రీనివాస్, లడ్డు ప్రసాదాల తయారీ టెండర్‌ను కిలోకు రూ.27లు కోట్ చేసి పోతిరెడ్డి పల్లికి చెందిన కె.నరేష్ దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తలనీలాలు, ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయం, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ టెండర్లకు సరియైన పాట రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. కార్యక్రమలో ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కొమురవెల్లి నూతన కమిటీని మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గురువన్నపేట జిల్లా ఉన్నత పాఠశాల ఎస్‌జీటీ నగవత్ భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి హైస్కూల్ అసిస్టెంట్ గ్యార ప్రవీణ్ కుమార్ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో దేవుల పల్లి గిరిబాబు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై హిందూ సంఘాల ఫిర్యాదు

గజ్వేల్‌రూరల్: దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైందవ సంఘాల నాయకులు, హిందూ జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరె కృష్ణ చిత్రపటాన్ని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద దహనం చేసి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరె కృష్ణను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ రమేష్, పురోహితులు చాడ నందబాలశర్మ, శేషం నివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

ములుగు(గజ్వేల్): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఇష్టమైన రంగంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ములుగు మండలం ఆర్అండ్ఆర్ కాలనీ తునికిబొల్లారం ఉన్నత పాఠశాల హెచ్ఎం కవితాదేవి అన్నారు. మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా రూ.70 వేల విలువగల స్పోర్ట్స్ దుస్తులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి



హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

హుస్నాబాద్: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దివ్యాంగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మితాసబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంపత్, వేణు, సరిత, జ్యోతి, రాజేశ్వరి, లింగన్న, కనకయ్య, రాములు, రమేష్, బికస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక బడ్జెట్

దుబ్బాక: కేంద్రం ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. మంగళవారం దుబ్బాకలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్‌ల కోసమే తయారు చేసిన విధంగా ఉందన్నారు. ఆహార భద్రత, ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం చేసే దిశగా బడ్జెట్ లేదన్నారు. బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ చట్టాలపై అవగాహన

సిద్దిపేటఎడ్యుకేషన్: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాతో పాటు వారి సంరక్షకులకు మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ కనకచంద్రం పాల్గొన్నారు.

పంటల వివరాల నమోదు చేపట్టాలి

గజ్వేల్ ఏడీఏ బాబునాయక్

గజ్వేల్: పంటల సాగు వివరాల నమోదును పకడ్బందీగా చేపట్టాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ అన్నారు. మంగళవారం గజ్వేల్ కార్యాలయంలో వానాకాలం పంటలసాగుపై ఏఓలు, ఏఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఏఈఓలు తమ క్లస్టర్ల పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సాగు వివరాలను సమర్థవంతంగా నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు వస్తాయన్నారు. అలాగే రైతు బీమా కొత్త దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 4వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో గజ్వేల్ ఏఓ నాగరాజు, కొండపాక ఏఓ ప్రియదర్శిని, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా జనరల్ సెక్రటరీ మల్లుగారి ఇంద్రసేనా రెడ్డి పేర్కొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న ప్రతీ సమస్యకు పరిష్కారం చూపడానికి పీఆర్టీయూ ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ నీలం శ్రీనివాస్, జిల్లా నాయకులు పి.నారాయణ, భగవాన్, మండల అధ్యక్షుడు సిద్ది వెంకటేష్, జనరల్ సెక్రటరీ బందారం చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉనికి కోసమే ఆరోపణలు**
కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

కొమురవెల్లి(సిద్దిపేట): సీపీఎం నాయకులు తమ ఉనికి కోసమే కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. చేర్యాల ప్రాంతాన్ని అభివృద్ధి చేయని బీఆర్ఎస్‌కు మద్దతుగా సీపీఎం వ్యవహరిస్తోందన్నారు. చేర్యాల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మాట్లాడిన తీన్మార్ మల్లన్నను సీపీఎం నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు, పార్టీపై ఇష్టారీతిగా మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాస్, కనకరాజు, చెరుకు రమణారెడ్డి, ఉప్పల వంశీకృష్ణ, జంగని రవి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **కేంద్ర బడ్జెట్‌లో మొండి చెయ్యి**

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేష్ మంగళవారం మండిపడ్డారు. రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలకు సైతం నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. నిధులు తేలేకపోయిన కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

◆ **విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుపై హర్షం**

అక్కన్నపేట(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కరంటోతు రవి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా విద్యుత్ లోవోల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రి స్పందించి సబ్‌స్టేషన్ మంజూరుకు కృషిచేసినందుకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **మహిళా రక్షణ చట్టాలపై అవగాహన**

సిద్దిపేటరూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధి గుర్రాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, షీ టీమ్ విధులు, ర్యాగింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట షీ టీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణాకుమారి, హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **సీపీని కలిసిన ఎస్ఐలు**

సిద్దిపేటకమాన్: బాధ్యతలు చేపట్టిన తొగుట పోలీసు స్టేషన్ ఎస్ఐ రవికాంత్‌రావు, రాజగోపాలపేట ఎస్ఐ మహ్మద్ ఆసీఫ్ సీపీ అనురాధను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదులపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

◆ **స్వాధీనం చేసుకున్న**
భూమిలో అక్రమ నిర్మాణాలు

బెజ్జంకి(సిద్దిపేట): గతంలో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో మళ్లీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని గూడెం గ్రామస్తులు మంగళవారం గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 321లో ఆక్రమణకు గురైన భూమిని గ్రామ అభివృద్ధి పనుల కోసం వినియోగించాలని కోరుతూ అప్పటి తహసీల్దార్ ఫిబ్రవరిలో స్వాధీనం చేసుకున్నారు. మళ్లీ పలువురు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. నిర్మాణాలను తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **ఇసుక వేలం**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలో అక్రమంగా సరఫరా చేస్తున్న ఇసుక వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం బహిరంగ వేలం వేశారు. ఇసుక వేలం పాటలో 14 మంది పాల్గొన్నారు. 90 టన్నుల ఇసుకను వేలం వేయగా రూ.2.05 లక్షలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

◆ **అవినీతిని బయటపెడతాం**

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అవినీతి, అక్రమాలను బయటపెడతామని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధరమ్ గురువారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాల అనుమతులపేరిట భారీఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ కార్యక్రమాల పేరిట బిల్లులు డ్రా చేస్తున్నారని చెప్పారు. వర్గల్‌లో ఫుడ్ పార్కు భూసేకరణలోనూ అక్రమాలు బయటపడుతున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.